ప్రజాశక్తి
ఆదివారం 2 జూన్ 2024
5
విజయనగరం



మీటర్లు ఎలా పనిచేస్తున్నాయి?

ఇంటింటికీ వెళ్లి ఉచిత మీటర్లను పరిశీలించిన సిఎండి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత మీటర్లు ఏ విధంగా పనిచేస్తున్నాయని ఎపిఇపి డిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మాది తనిఖీ చేపట్టారు. శనివారం మండలంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేపట్టారు. సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. అనంతరం మండలంలో రాయి మానుగూడ, లక్కాయిగూడ, దేవనా పురం, కుసిమి గ్రామాలను సందర్శిం చారు. లబ్ధిదారులకు ఉచిత మీటర్లు అందాయా? లేదా? అడిగి తెలుసు కున్నారు. ఎలా పనిచేస్తున్నాయని ఆరాతీశారు. వినియోగదారుల సమస్యలు వీలైనంతవరకు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. డైరెక్టర్ సూర్య ప్రతాప్, ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం, ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి, డిఇ గోపాలకృష్ణ, ఎఇ జి.నీలిమ పాల్గొన్నారు.

కాకరేపుతున్న పోస్టల్ బ్యాలెట్

2024 ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

విజయనగరం	4201
రాజాం	2116
బొబ్బిలి	2433
చీపురుపల్లి	1496
గజపతినగరం	2089
నెల్లిమర్ల	1759
విజయనగరం	4201
శృంగవరపుకోట	2005
పార్వతీపురం	2091
కురుపాం	2446
సాలూరు	1467
పాలకొండ	1796

సార్వత్రిక ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తుండడంతో అభ్యర్థుల్లో ఆందోళన ఉత్కంఠ పెరుగుతోంది. గెలుపు ఓటములపై లెక్కలు వేసుకోవడంలో తలమునకలయ్యారు. హోరాహోరీ పోటీ నెలకొన్న ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అత్యంత కీలకం కానున్నాయి. ఈవిఎంల ద్వారా పడిన ఓట్ల కంటే ఉద్యోగ,ఉపాధ్యాయులు వేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లే నేడు చర్చనీయాంశమవు తున్నాయి. ప్రభుత్వంపై ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం ఉందని, అధిక శాతం ఓట్లు తమకే పడతాయని టిడిపి అంచనాలు వేస్తోంది. తమకూ ఉద్యోగులు ఓటేశారని వైసిపి నమ్ముతోంది. 2019 ఎన్నికల్లో మాత్రం వైసిపికే అధిక శాతం ఓట్లు పోలయ్యాయి.

- గత ఎన్నికల్లో వైసిపికే అధిక శాతం ఓట్లు
- ఉద్యోగులు ఈసారి ఎవరిని కరుణించేనో?



ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 11 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, సగానికి పైగా అసెంబ్లీ స్థానాల గెలుపు ఓటములపై పోస్టల్ బ్యాలెట్ ఓట్లే తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. విజయనగరం జిల్లాలో 18,631 మంది ఓటర్లకు గాను 16,469 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 370 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. మన్యంలో 6,812 మంది పోస్టల్‌బ్యాలెట్‌కు దరఖాస్తు చేయగా, 8907 ఓట్లు పోలయ్యాయి. అయితే ఎన్నికల డ్యూటీ పడిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేయకపోయినా ఓటు వేయవచ్చనే నిబంధనతో పోలింగ్ ఎక్కువగా జరిగింది.

నువ్వా..నేనా అంటూ పోటీ పడిన టిడిపి, వైసిపి అభ్యర్థులకు పడిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లే అత్యంత కీలకంగా మారాయి. జూన్ 4న వారి తలరాతను మార్చే స్థాయిలో పోల్ కావడం గమనార్హం. ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అత్యధికంగా పోలయ్యాయి. ఇప్పుడే ఈ ఓట్లే అధికార వైసిపి అభ్యర్థుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. తమకు ఏమాత్రం ఓట్లు పడ్డాయోనన్న ఆందోళనతో ఉన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో సిఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగించారు. విధి నిర్వహణలో తీవ్ర పని ఒత్తిడే కాకుండా వారికి దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై కోలుకోలేని దెబ్బ కొట్టారు. ఫలితంగా వైసిపి పాలనపై ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఈ అసంతృప్తి పోలింగ్ సందర్భంగా ఉద్యోగుల్లో కనిపించింది. పెద్దఎత్తున పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు కారణమైంది.

మెరుగైన పిఆర్‌సి, డిఎల చెల్లింపు,సిపిఎస్ రద్దు వంటి కీలక హామీలను నెరవేరుస్తామంటూ జగన్ చెప్పిన మాటలు నమ్మిన ఉద్యోగులు గత ఎన్నికల్లో వైసిపికే ఎక్కువగా ఓట్లు వేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను నెరవేర్చకపోగా ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్రంగా అణచివేశారు. వారిలో గూడుకట్టుకున్న ఆవేశం, అసంతృప్తి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రోజున వెల్లగక్కినట్లు తెలుస్తోంది. స్వల్పమెజార్టీతో ఓడిపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులే కారణమన్న చర్చ జరుగుతోంది.

2019 ఎన్నికల్లో ఇలా..

2019 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 14,269 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేయగా, అందులో 7,145 ఓట్లు వైసిపికి, 4,358 ఓట్లు టిడిపికి పడ్డాయి. మరో 2,740 ఓట్లు చెల్లకపోవడంతో తిరస్కరణకు గురయ్యాయి. 130 ఓట్లు నోటాకు పడ్డాయి.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	వైసిపి	టిడిపి	చెల్లనవి	నోటా
విజయనగరం	2,628	1,304	496	691	10
ఎస్.కోట	1,281	616	515	127	03
గజపతినగరం	1,507	868	400	104	06
బొబ్బిలి	1,942	1070	761	571	00
నెల్లిమర్ల	1,112	669	263	332	00
చీపురుపల్లి	1,141	669	208	214	00
పార్వతీపురం	1,643	444	1081	08	06
సాలూరు	1,502	814	316	291	103
కురుపాం	1,513	664	318	402	01

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి

సిరిపురంలో విషాదం

ప్రజాశక్తి- రేగిడి

సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన లైన్‌మేన్ బూరాడ మాధవరావు (30) శనివారం విద్యుదాఘాతంతో అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడు అదే మండలం మోదుగులపేట సచివాలయంలో జూనియర్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గాలివానకు గ్రామంలో ఓ పంట పొలంలో విద్యుత్ వైర్ తెగిపడింది. విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు శనివారం విద్యుత్ వైర్లు సరిచేసే దిశగా అటుగా వెళ్లిన మాధవరావు వైరు సరిచేసే క్రమంలో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పంట పొలాలకు వెళ్లిన రైతు కూలీలు మృతి చెందిన మాధవరావును చూసి గ్రామానికి సమాచారం అందించారు. గ్రామస్తులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. శవపంచినామ నిర్వహించి, రాజాం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిరిపురంలో విషాదఛాయలు

మోదుగుల పేటలో సచివాలయం ఉద్యోగుగా పనిచేసిన బూరాడ మాధవరావు విద్యుదాఘాతంతో మృతి చెందడం సిరిపురం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పేదరికం నుంచి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని ఆదుకుంటాడని అనుకున్న తరుణంలో విధి వెక్కిరించి ఆ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసిందని రోదిస్తున్నారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.



మాధవరావు మృతదేహం

పెళ్లి సంబంధం చూస్తున్న తరుణంలో..

మాధవరావుకు పెళ్లి సంబంధం చూశాం. మూలం కావడంతో ఆగస్టు నెలలో జావాం సంబంధం చేసుకుందామని అనుకున్న తరుణంలో ఇలా విద్యుదాఘాతంతో మృత్యువాత పడడటంతో కుటుంబ సభ్యుల రోధన అంతా ఇంతా కాదు

రెమ్యునరేషన్ ఇవ్వలేదని నిరసన

ప్రజాశక్తి-చీపురుపల్లి

తమతో పని చేయించుకొని వదిలేశారని ఎన్నికలలో విధులు నిర్వర్తించిన రూట్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు తాము 35 మందిమి ఎన్నికల విధులలో భాగంగా రూట్ ఆఫీసర్లుగా 14 రోజుల పాటు పనిచేసామని తెలిపారు. ఇవిఎంలు పోలింగ్ కేంద్రాలకు అప్పగించినప్పటి నుంచి తిరిగి లెండి కళాశాలకు ఇవిఎంలు చేర్చే వరకు రాత్రింబవళ్ళు పని చేసామన్నారు. అయినప్పటికీ తమకు రావలసిన రెమ్యునరేషన్ ఇవ్వలేదని వాపోయారు. సంబంధిత అధికారులను అడుగుతుంటే కలెక్టర్ నుంచి ఎటువంటి ఆదేశాలూ రాలేదని చెబుతున్నారని తెలిపారు. తాము పనిచేసిన కాలానికి రెమ్యునరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న రూట్ ఆఫీసర్లు



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తులసీరామ్

జీతాల బకాయిలు చెల్లించాలి

ఎపిపిటిడి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తులసీరామ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి విజయనగరం జోనల్ వర్క్ షాప్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఎపిపిటిడి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ.జగన్ మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకు ప్రభుత్వ సంస్థ అయినా సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, ఏప్రిల్ వేతనం నేటికీ చెల్లించకపోతే కార్మికలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. సర్కులర్ ప్రకారం స్కిల్, సెమిస్కిల్, అన్ స్కిల్డ్ జీతాలు 6 నెలలకు ఒకసారి పెరిగే డిఎ కలిపి చెల్లించాలని, రాష్ట్రంలో ఒక్క చోటైనా ఆ విధంగా చెల్లించడం లేదని తెలిపారు. అటువంటి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవలసిన వర్క్ మేనేజర్లు, డిపిటిఒలు, డిఎంలు సకాలంలో జీతాలు చెల్లించమని అడుగుతున్న కార్మికులపై ఎదురుదాడికి దిగుతున్నారని, ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. విజయనగరం జోనల్ వర్క్ షాప్ వర్క్ మేనేజర్ తక్షణమే కలుగజేసుకుని ఇక్కడ కార్మికులకు ఏప్రిల్ మే నెల వేతనాలు తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టర్ కాలపరిమితి ముగిసినందున అనేశ్వర సంస్థ నుంచి కార్మికులకు రావలసిన బకాయిలన్నీ ఇప్పించాలన్నారు. ప్రతి ఆరు నెలలకు పెరిగే డిఎ సర్కులర్ ను నోటీసు బోర్డులో పెట్టాలని,కార్మిక శాఖ ప్రకటించిన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్‌టిసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

- జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమలు
- ర్యాలీలకు, మందుగుండు సామగ్రి వినియోగానికి అనుమతులు లేవు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
- ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 4న ఎన్నికల కౌంటింగు చేపట్టే జెఎన్‌టియు, లెండి ఇంజినీరింగు కళాశాలల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడంచెల భద్రతలో భాగంగా స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగు కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు భద్రత విధులు నిర్వహిస్తాయన్నారు. వీరు కాకుండా ఇంజినీరింగ్ కళాశాల భవనాలకు 2కిలోమీటర్ల పరిధిలో కట్ ఆఫ్ పార్టీలు పహారా కాస్తుంటాయన్నారు. ఈ ప్రాంతాల్లోకి కౌంటింగు విధులు నిర్వహించే ఉద్యోగులు, ఆథరైజేషన్ లెటర్లు ఉన్న ఏజంట్లు, మీడియా వారికి మాత్రమే అనుమతిస్తామని ఎస్‌పి తెలిపారు. కౌటింగు నిర్వహించే రోజున జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు వినియోగానికి ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేసారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించినా,, మందుగుండు సామగ్రిని వినియోగించినా వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి జూన్ 6 వరకు అమలులో ఉన్నందున, కౌంటింగు రోజున ఎన్నికల నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగు పూర్తయి, ఫలితాలు వెల్లడైన తరువాత అల్లర్లు జరిగేందుకు అవకాశం ఉన్న 100 గ్రామాలను ముందుగా గుర్తించి, ఆయా గ్రామాల్లో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ముందుగా పికెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమస్య ఎక్కడ ఉత్పన్నమైనా, వెంటనే స్పందించేందుకు ప్రత్యేకంగా క్విక్ రియాక్షన్ టీమ్స్ ను కూడా ఏర్పాటు చేసామన్నారు. కౌంటింగు కేంద్రాల్లోకి వెళ్లే ఏజెంట్లు తమ వెంట మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, స్మార్టు వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, భోజనాలు, వాటర్ బాటిళ్ళను అనుమతించమన్నారు. కౌంటింగు కేంద్రాల వద్ద రెడ్ జోన్ లను ఏర్పాటు చేసామని, రెడ్ జోన్ పరిధిలో ఎవ్వరూ కూడా డ్రోన్లను వినియోగించడాన్ని నిషేధించామని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్,స్పెషల్ బ్రాంచ్ సిఐ కెకెవి విజయనాథ్, వన్ టౌన్ సిఐ బి. వెంకటరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

కౌంటింగ్ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

కౌంటింగు ప్రక్రియ చేపట్టే జూన్ 4న విశాఖపట్నం – విజయనగరం, విజయనగరం – విశాఖపట్నం, గజపతినగరం – విశాఖపట్నం వైపు వెళ్ళే వాహనాల ట్రాఫిక్ మళ్లించనున్నట్లు ఎస్‌పి తెలిపారు.

- విశాఖపట్నం నుండి విజయనగరం వైపు వచ్చే వాహనాల మహరాజుపేట మీదుగా నాతవలస జాతీయ రహదారి వైపు మళ్లిస్తామన్నారు.
- మోదవలస జంక్షన్ వరకు వచ్చిన వాహనదారులను మోదవలస జంక్షన్ వద్ద గల శిల్ప మెడికేర్ మీదుగా నాతవలస వైపు జాతీయ రహదారి వైపు మళ్లిస్తామన్నారు.
- విజయనగరం నుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాలకు విటి అగ్రహారం వై–జంక్షన్ వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేసి, విశాఖపట్నం వైపు వెళ్ళే వాహనాలను రామనారాయణం మీదుగా కొత్తవలస లేదా పద్మనాభం వైపు మళ్లిస్తామన్నారు.
- అయినాడ జంక్షన్ వరకు వచ్చే వాహనాలను చింతలవలస, గంట్లాం మీదుగా అక్కివరం జాతీయ రహదారి వైపు మళ్ళిస్తామన్నారు.
- జొన్నాడ వరకు వచ్చే వాహనదారులను చింతలవలస, గంట్లాం మీదుగా అక్కివరం జంక్షన్ జాతీయ రహదారి వైపు మళ్లిస్తామన్నారు.
- గజపతినగరం వైపు నుండి వచ్చే వాహనాలను గొట్లాం బైపాస్ రోడ్డు మీదుగా కోరాడపేట బ్రిడ్జి కింద నుండి చిన్నాపురం లేదా కొత్తవలస వైపు మళ్లిస్తామన్నారు.

వీలైనంత వేగంగా ఓట్ల లెక్కింపు

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

నిర్ణీత సమయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలని రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కౌంటింగ్, ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాజాగా ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆదేశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమావేశం నిర్వహించారు. 4వ తేదీ ఉదయం 8 గంటలకే పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఖచ్చితంగా ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికోసం 7.30 గంటలకే ట్రంకు బాక్సులు లెక్కింపు కేంద్రాల్లోకి తరలించి, 500 చొప్పున కట్టలు కట్టి టేబుళ్ల వద్దకు చేర్చాలని సూచించారు. ప్రాథమిక లెక్కింపులో మొదటి రౌండ్ గంట సమయం తీసుకున్నప్పటికీ, రెండో రౌండ్ నుంచి మాత్రం 45 నిమిషాల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో దశలో చేపట్టే పోస్టల్ ఓట్ల సమగ్ర లెక్కింపు ప్రక్రియలో ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తి కావడానికి గంటన్నర కంటే ఎక్కువ సమయం తీసుకోకూడదని సూచించారుఇటిపిబి లెక్కింపు కూడా వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఖచ్చితంగా ఉదయం 7.30 గంటలకు స్ట్రాంగ్ రూములను తెరవాలని, ఈ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయించాలని చెప్పారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈవిఎం ఓట్ల లెక్కింపులో ఒక్కో రౌండ్ 20 నిమిషాల లోపే పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా 8.15 గంటలకే కంట్రోల్ యూనిట్లను కౌంటింగ్ టేబుళ్లవద్దకు చేర్చాలని సూచించారు. ప్రతీ రౌండ్ పూర్తయిన వెంటనే ఫలితాలను తప్పులు లేకుండా ఎన్‌కోర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించి, సజావుగా, వేగంగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6.45 గంటలకల్లా లెక్కింపు కేంద్రాలవద్ద సిద్దంగా ఉండేలా చూడాలని సూచించారు. లాటరీ ద్వారా ఎంపిక చేసిన 5 వివి ప్యాట్‌లను, సిద్ధంగా ఉంచిన ప్రత్యేక క్యాబిన్‌లలోకి తరలించి, ఒక్కో దానిలోని స్లిప్పులను 30 నిమిషాల్లోపే లెక్కించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కౌంటింగ్ సెంటర్లలో ఏర్పాట్లన్నీ ఆదివారం సాయంత్రానికి పూర్తి చేయాలని, సిబ్బందికి 3వ తేదీన ప్రత్యక్ష శిక్షణ ఇప్పించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన తాజా ఆదేశాలను కలెక్టర్ వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ ఎస్‌డి అనిత, నోడల్ అధికారులు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఆర్ఓలు పాల్గొన్నారు.

4న మద్యం దుకాణాలు మూసివేత


ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీన జిల్లాలో మద్యం షాపులన్నిటినీ మూసివేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ మద్యం దుఖాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, సంకిలిలోని డినేచర్డ్ ఇథనాల్ యూనిట్, డినేచర్డ్ స్పిరిట్ మొలాసిస్ యూనిట్స్, మెథనాల్ యూనిట్లు, కల్లు దుఖాణాలను మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. 3వ తేదీ సాయంత్రం 6 గంటలు నుంచి 4వ తేదీ మంగళవారం రోజంతా వీటన్నిటినీ మూసివేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షిపాతంగా నిర్వహించేందుకు ఈ డ్రైడే నిబంధనలను పాటించాలని ప్రకటనలో కోరారు. డ్రైడే రోజు మద్యం సేవించడం, కలిగి ఉండం, తాగడం నేరమని, దానిని అతిక్రమించినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

కంచే చేను మేస్తే..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో అసైన్డ్ భూముల దోపిడీ వ్యవహారం కంచే చేను మేసేసినట్టుగా ఉంది. పెద్దలకు అధికార యంత్రాంగం సహకరించడం, భూములిచ్చేందుకు ముందుకు రానివారిపై పోలీసులు బెదిరింపు చర్యలకు పూనుకోవడం వంటివి యథేచ్ఛగా సాగుతున్నాయట. దీంతో, భూదోపిడీదారుల ఆగడాలకు అడ్డేలేకుండా పోయిందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేదో ప్రతిపక్ష పార్టీ నాయకులో లేక, కొందరు వ్యక్తులో చేస్తున్న ఆరోపణలు కాదు సుమా...! కొద్దిరోజులుగా జిల్లాలో హాట్‌హాట్‌గా సాగుతున్న పబ్లిక్ టాక్. ప్రభుత్వం తీసుకొచ్చిన 9/23 ఆర్డినెన్స్ ప్రకారం సాగుదారులకు దఖలు పర్చాల్సిన భూమిని కొంతమంది పెద్దలు అడ్డగోలుగా వశపర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం రూ.కోట్ల విలువైన భూములకు రూ.లక్షలు చేతిలోపెట్టి భూములు రాయించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం తనకు పట్టనట్టుగా, తెలియనట్టుగా ఉండడంపై జనం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారమంతా అధికారుల కనుసన్నల్లో వారి అండదండలతోనే సాగుతోందని కూడా జనం చర్చించుకుంటున్నారు.

ముఖ్యంగా పూసపాటిరేగ మండలం కందివలస, చోడమ్మ అగ్రహారం, కనిమెట్ట రెవెన్యూ గ్రామాల పరిధిలో 200 ఎకరాలు దళితులు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన పేదల సాగులో ఉన్నాయి. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలోని భూమి విలువ ఎకరా సుమారు రూ.1కోటి నుంచి రూ.కోటి 30లక్షల వరకు పలుకుతోంది. దీంతో, ఈభూమిపై ల్యాండ్ మాఫియా కళ్లు పడ్డాయి. రాజకీయ నేతల బినామీలు గ్రామాల్లోకి వచ్చి ఎకరాకు రూ.20లక్షల చొప్పున బేరం కుదుర్చుకుని అక్కడి పరిస్థితిని బట్టి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు అడ్వాన్సులు ఇచ్చారు. ఇదే మండలంలోని కొవ్వాడ, కోనాడ, బత్తివలసతోపాటు భోగాపురంలోని పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. గంట్యాడ మండలం పెద మధుపాడ రెవెన్యూ పరిధిలో 150 ఎకరాల్లో 200 మంది దళితులు, ఇతర పేద సామాజికవర్గాలు సాగు చేస్తున్న 150 ఎకరాలపైనా పెద్దల కల్లుపడ్డాయి. ఎలాగైనా తమకు విక్రయించాలంటూ ఒత్తిడి చేస్తున్నారట. కొత్తవలస, వేపాడ, బొబ్బిలి తదితర మండలాల్లో కూడా ఇదేరకమైన దోపిడీ జరుగుతోంది.



దాదాపు అన్నిచోట్లా అసైన్డ్ పట్టాదారులకు దోపిడీదారులు మాయమాటలు చెప్పి మాటలు చెప్పి బురిడీకొట్టిస్తున్నారట. '20ఏళ్లు దాటి సాగులోవున్న అసైన్డ్ భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేస్తున్నమాట వాస్తవమే. కానీ, మీ భూములకు అందుకు తగిన రికార్డులు ఉన్నాయో లేవో. బహుశా అందుకే మీ పేర్లు అధికారులు వెల్లడించలేదు. పేర్లు లేనప్పుడు మీకు పట్టాలు ఎలా వస్తాయి. అంటూ నమ్మబలకుతున్నారని గ్రామాల్లో జనం చర్చించుకుంటున్నారు.

వాస్తవానికి ఆర్డినెన్స్ ద్వారా పట్టాల పంపిణీకి గ్రామాల వారీగా అసైన్డ్ భూమి సాగుదారులు ఎవరు? వారికి ఏ సంవత్సరంలో ప్రభుత్వం అప్పగించింది? ముఖ్యంగా 2003కు మునుపు ఇచ్చిన భూమి ఎంత? వాటిని అసైన్డ్ పట్టాదారులే సాగు చేస్తున్నారా? లేక వారి వారసులు సాగు చేస్తున్నారా? అప్పట్లో ఇచ్చిన భూమంతా వీరిచేతిలోనే ఉందా? లేక ఇతరులెవరైనా సాగు చేస్తున్నారా? అన్న కోణంలో గత ఏడాది అక్టోబరులోనే భూమి వివరాలు సేకరించి, ప్రభుత్వానికి నివేదించినట్టు సమాచారం. ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే ఆ పెద్దల ఒత్తిడితో అసైన్డ్ ల్యాండ్, అందులోని ఫ్రీహోల్డ్ చేసిన భూముల వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారని జనం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో, వేలాది మంది దళితులు, పేదలు మోసపోతున్నారనే చర్చ సాగుతోంది.

శ్రీచైతన్య కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

బొబ్బిలి: భవనం లేకుండా ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్న శ్రీచైతన్య కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మణికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం అనుమతులు తీసుకుని భవనం లేకుండా అడ్మిషన్లు చేస్తున్నారని విమర్శించారు. నూతన భవనం నిర్మాణంలో ఉంటే విద్యార్థుల నుంచి అడ్మిషన్లు చేయడం దుర్మార్గమన్నారు. భవనం లేకుండా అడ్మిషన్లు చేస్తున్న కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని గుర్తింపు రద్దు చేయాలని కోరారు. లేనిచో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోతే పోరాటం

బొబ్బిలి: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోతే పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఒకవైపు ఎండలు తీవ్రత మరోవైపు విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో లోవోల్టేజ్ సమస్యతో విలువైన ఎలక్ట్రికల్ సామగ్రి కాలిపోవడంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేస్తున్న ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోవడం అన్యాయమన్నారు. విద్యుత్ కోతలను నివారించి నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలను నివారించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోతే విద్యుత్ శాఖ ఇఇ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈనెల 3,4,5న వైన్ షాపులను మూసి వేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ బెల్ట్ షాపులకు మద్యాన్ని తరలించి నిల్వ చేస్తున్నారని ఆరోపించారు. వైన్ షాపులు మూసివేసిన పట్టణ, గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులు మద్యాన్ని నిల్వ చేసి అధిక ధరలకు అమ్మే పరిస్థితి ఉందన్నారు. బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లేనిచో మద్యం మత్తులో రాజకీయ గొడవలు జరిగే అవకాశం ఉందన్నారు. బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు.

బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో టోర్నమెంట్

శృంగవరపుకోట: పట్టణంలోని కేంబ్రిడ్జి నారాయణ పాఠశాలలో గత నెల రోజులుగా జరుగుచున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ చివరి దశలో భాగంగా క్రీడాకారుల మధ్య టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను, మినీ జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలుగా విభజించి వారి గ్రూపుల మధ్య బాలుర బాలికలకు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం సింగిల్ పోటీలు, ఆదివారం డబుల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లుగా మొహమ్మద్ అస్లాం, బి.హరిక, పి.మౌనికలు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

చేపలకంచేరు మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చేపలకంచేరు మాజీ సర్పంచ్ మైలపల్లి పైడితల్లి గురువారం రాత్రి మృతి చెందారు. ఈమె గత కొన్నాళ్లుగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. ఈమె మూడుసార్లు చేపలకంచేరు సర్పంచ్‌గా పని చేశారు. ఈమె భర్త ఎల్లాజీ గుండెపోటుతో చనిపోయి సుమారు 11 నెలలు అవుతుంది. ఇంతలోనే ఈమె కూడా చనిపోవడంతో కుటుంబమంతా శోకసముద్రంలో మునిగింది. వీళ్లకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె కాగా పెద్ద కుమారుడు ఎల్లాజీ టిడిపిలో నాయకుడిగా కొనసాగుతున్నారు. ఆ పార్టీ నాయకులు కర్రోతు అప్పలరామిరెడ్డి, కోరాడ తాతారావు, ఎంపిటిసి పిడుగు వెంకట సత్యం, దాసరి అప్పలస్వామి, కర్రోతు రాజు తదితరులు ఆమె అంతిమయాత్రలో పాల్గొన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు, మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ తదితరులు ఆమె కుమారులను పరామర్శించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఎవిఎల్ శిరీష సూచించారు. మండలంలోని రొంపల్లి గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదన్నారు. ముఖ్యంగా గొడుగు, తలపై టోపీలు వేసుకొని బయటకు వెళ్లాలన్నారు. అనంతరం షుగర్, బీపీ ఇతర వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

ప్రజాశక్తి - వేపాడ

బడి బయట ఉన్న పేద పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని చైల్డ్ లేబర్ ఇన్‌స్పెక్టర్ టి. జోషి, ఎంఇఒ బాలభాస్కరరావు కోరారు. శనివారం వారు మండల కేంద్రంలో వారు పర్యటించి బడిబయట ఉన్న పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సి, సిఆర్‌పి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - భోగాపురం

ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బోర రమేష్ (30) శనివారం మృతి చెందారు. జాతీయ రహదారిలోని పోలిపల్లి వద్ద సర్వీస్ రహదారిలో శుక్రవారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు గాయాలయ్యాయి. నలుగురిలో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖలో చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలో వేగాన్ని నియంత్రించేందుకు మున్సిపల్, ఆర్ అండ్ బి అధికారులు వేసిన స్పీడ్ బ్రేకర్లు వృద్ధులకు యమపాశంలా మారింది. వాహనాలు వేగాన్ని నియంత్రించేందుకు పురపాలక మున్సిపల్ అధికారులు, ప్రధాన రహదారులలో ఆర్ అండ్ బి అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేశారు. చాలా చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఊడిపోయి ఇనుప స్క్రూలు ఉండిపోయాయి. రోడ్డుకు ఉన్న ఇనుప స్క్రూలు వాహనాలు టైర్లకు గుచ్చుకుంటే టైర్లకు పంక్చర్ అవ్వడంతో పాటు పాదచారులు స్క్రూలను తన్నడంతో గాయాలు పాలవుతున్నారు. బలిజిపేట రోడ్డులో దావాలవీధికి వెళ్లే రోడ్డులో ఉన్న స్క్రూలను ఒక వృద్ధుడు తన్నడంతో గాయపడ్డాడు. స్క్రూలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

తూడెంలో పిడుగుపడి రెండు ఆవులు మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని తూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి పిడుగు పడి రెండు ఆవులు మృతి చెందాయి. దువ్వ చిట్టిబాబు అనే రైతు తన రెండు ఆవులను ఎప్పటిలాగే కొబ్బరి తోటలో కట్టాడు. శుక్రవారం రాత్రి భారీ ఉరుములతో కూడిన వర్షం పడటంతో పాటు కొబ్బరి చెట్టుపై పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో కిందనున్న రెండు ఆవులు చనిపోయాయి. వీటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని యజమాని పైడిరాజు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు కోరాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలోని రాముడువలస సమీపంలోని తోటపల్లి కాలువ గట్టుపై స్థానికులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని వీఆర్ఒ అప్పారావుకు చెప్పడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోవడంతో అక్కడికక్కడే పోస్టుమార్టం చేసి పూడ్చిపెట్టారు. మృతుడు నీలిరంగు చొక్కా, తెలుపు, నీలిరంగు బనియన్ ధరించి ఉన్నాడని, మృతుని వివరాలు తెలిస్తే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు కోరారు.

పట్టాలు లేవని పరిహారం ఇవ్వలేదు

● ఇష్టానుసారంగా తోటలు ధ్వంసం చేస్తే ఎలా? ●ఆవేదన వ్యక్తం చేసిన రీసుపేట, బసవపాలెం గ్రామస్తులు ●చెట్ల తొలగింపు అడ్డగింత

ప్రజాశక్తి భోగాపురం

భూములకు పట్టాలు లేవని పరిహారం ఇవ్వకుండా ఏళ్ళ తరబడి ఏపుగా పెంచుకున్న జీడి తోటలను జిఎంఆర్ సంస్థ సిబ్బంది ఇష్టానుసారంగా ధ్వంసం చేస్తున్నారని మండలంలోని తూడెం పంచాయతీ రీసుపేట, బసవ-పాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కూడా తమ పరిహారం విషయంలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిఎంఆర్ సంస్థ తమ భూముల్లో చేపడుతున్న చెట్ల తొలగింపును శనివారం రైతులు అడ్డుకున్నారు. బసవపాలెం రెవెన్యూ పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయం సెక్యూరిటీ విభాగమైన సెంట్రల్ ఇండ్రస్టీరియల్ సెక్యూరిటీ


తమ పొలంలో చెట్లను తొలగించొద్దంటూ అడ్డుపడుతున్న ఒక కుటుంబం

ఫోర్స్ (సి.ఐ.ఎస్.ఎఫ్) సిబ్బంది ఉండేందుకు నివాస గృహాలు నిర్మించనున్నారు. ఇందుకోసం సర్వే నెంబరు 25లో 25ఎకరాలు ప్రభుత్వ భూమిని సేకరించారు. ఇందులో డీపట్టా మూడున్నర ఎకరాలు కూడా ఉంది. పట్టాలు ఉన్నందున ఆభూమికి ఎకరాకి రూ.53 లక్షలు నష్ట పరిహారం ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. మిగతా 22 ఎకరాల భూములకు పరిహారం ఊసెత్తలేదు. ఈ భూములు కూడా రైతుల ఆదీనంలోనే ఉన్నా పరిహారం ఇవ్వడానికి ముందుకు రాలేదు. దీంతో తమ తాత తండ్రలు నుంచి ఏళ్ళ తరబడి సాగు చేసుకుంటున్న తమ భూములకు రూపాయి కూడా పరిహారం ఇవ్వకపోవడం దారుణమని సుమారు 40 మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుకున్నా జెసిబితెఓ జీడితోట్ల తొలగింపు

ఈ భూముల్లో రైతులు పెంచుకున్న జీడితోటలను గత రెండు రోజులు నుంచి జిఎంఆర్ సంస్థ సిబ్బంది జెసిబిలతో పాటు రంపం మిషన్లతో తొలగిస్తున్నారు. రైతులు అడ్డుకుంటున్నప్పటికీ రైతులను పక్కకు తోసేసి మరీ దౌర్జన్యంగా తొలగిస్తున్నార రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు మాత్రం చెట్ల దగ్గరకు జెసిబిలు రాకుండా అడ్డంగా నిలబడి అడ్డుకున్నారు. మరి కొంతమంది రైతులు అందుబాటులో లేకపోవడంతో వారి తోటల్లో చెట్లను తొలగించారు. ఒక మాజీ ఆర్మీ అధికారి తన భూమికి సంబంధించిన పేపర్లు ఉన్నాయని చెప్పడంతో తహశీల్దారు కార్యాలయానికి వెళ్ళి చూపించాలని అక్కడ ఉన్న అధికారులు సూచించారు.

మహిళలమని చూడకుండా దౌర్జన్యం చేస్తున్నారు

ఎన్నో ఏళ్ళ నుంచి ఈ భూముల్లో మేమంతా సాగు


జెసిబితో చెట్లను తొలగిస్తున్న జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు

చేసుకుంటున్నాం. రూపాయి నష్ట పరిహారం ఇవ్వకుండా ఎప్పటి నుంచో పెంచిన జీడి చెట్లను నరికేస్తున్నారు. అడ్డుపడితే జిఎంఆర్ సంస్థ సిబ్బంది మహిళలమని చూడకుండా దౌర్జన్యం చేస్తున్నారు. నా భూజంపై చేయివేసి మరి తోసేశారు. ఇది చాలా దారుణం. మమ్మల్ని నాయకులు, అధికారులు ఆదుకొని నష్టపరిహారం ఇప్పిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నాం.


రీసు పాప, మహిళా రైతు, బసవపాలెం.

భారీగా పెరిగిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విజయనగరం పట్టణంలో కూరగాయల ధరలు 2,3 రోజుల్లోనే 50 నుంచి 80 శాతం వరకు పెరిగాయి. కేజీ టమాటా రూ.25-30 నుంచి రూ.60కి, పచ్చి మిర్చి రూ.80 నుంచి రూ.120కి, కందిపప్పు రూ.110-120 నుంచి రూ.200కి పెరిగింది. బీన్స్ అయితే రూ.150గా ఉంది. 40 రూపాయిల ఉన్న వంకాయ, బీరకాయ, బెండకాయ, దొండకాయ, చిక్కుళ్ళు వంటి కూరగాయ కేజీ రూ.40 నుంచి 60,70 రూపాయిలకు పెరిగిపోయాయి. 200 ఉండే కేజీ చికెన్ రూ.260, 280కి చేరింది. మటన్ రూ.800 నుంచి రూ.1000 పలుకుతోంది. స్టాక్ తగ్గడం, పక్క రాష్ట్రాల నుంచి దిగుమతుల వల్లే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయల తర్వాత వంటల్లో ఎక్కువగా వాడే


అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

పప్పుల రేట్లు అంతకంటే ఎక్కువయ్యాయి. మొన్నటి వరకు కిలో రూ.110-120 పలికిన కందిపప్పు ఇప్పుడు రూ.200కు చేరింది. క్వాలిటీ ఆధారంగా శనగపప్పు రూ.90-100, పప్పు రూ.110-120, పెసర పప్పు రూ.140, మినుముల పప్పు రూ.140-150 అయింది. నూనె కిలో రూ.180-190 ఉండగా, సన్ ఫ్లవర్ ఆయిల్ 120- 125 వరకు అమ్ముతున్నారు. అల్లం కిలో రూ.200 ఉంటే వెల్లుల్లి పాయలు రూ.300పలుకుతోంది. చింతపండు కూడా రూ.120-130 అవడంతో జనాలు బెంబేలెత్తి పోతున్నారు. కేజీ రూ.30 లు ఉన్న టమాట ఇప్పుడు ఏకంగా రూ.60లకు పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి ఇతర కూరగాయలతో పాటు క్యారెట్, క్యాప్సికం వంటివి కర్నాటక నుంచి ఎక్కువగా వస్తున్నట్లు చెబుతున్నారు. ఈసారి చెడగొట్టు వానల కారణంగా చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో అవసరానికి అనుగుణంగా సాగులేక మార్కెట్లకు స్టాక్ రావడం తగ్గిందనీ వ్యాపారులు చెబుతున్నారు. ఒక్క సారి అధిక రేట్లకు కూరగాయల ధరలు పెరగడంతో నగర వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఖగోళశాస్త్రంపై వివరణ

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఖగోళ శాస్త్రం పై వివరించారు. విశ్వంలో సౌర కుటుంబం, పాలపుంత, గెలాక్సీ గురించి, సూర్యుడు ఒక నక్షత్రం అని, స్వయం ప్రకాశం శక్తిని కలిగి వుంటుందని, గ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉంటాయని ఖగోళ శాస్త్రం ఉపాధ్యాయులు వివరిం చారు. లైబ్రేరియన్ మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యాక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పుస్తక పఠనం, యోగాపై పిల్లలకు శిక్షణ శనివారం శిక్షణ ఇచ్చారు. యోగా విద్యార్థుల మానసిక ఉల్లాశానికి, శారీర దృఢత్వానికి ఉపయోగ పడుతుందని హైస్కూల్ టీచర్ కె.విశ్వ అన్నారు. పిల్లలచే పద్మాసనం, భుజంగాసనం, సూర్య నమస్కారాలు నేర్పించారు. శాఖా గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ తరగతుల ప్రారంభమయ్యాయని హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి మహిళా జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి గ్రూపులకు సంబంధించిన తరగతులను ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ఎస్‌కోటకు సమీప దూరంలోనే గల ఈ హైస్కూల్ కళాశాల తరగతులకు ప్రభుత్వం అనుమతించిందని ఎంపిసి, బైపిసి గ్రూపులకు అర్హత, అనుభవం కలిగిన పిజిటి అధ్యాపకులను ప్రభుత్వం గత సంవత్సరమే నియమించిందని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఈ మహిళా జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిజిటి అధ్యాపకులు పి శివాజీ, రహీంషేక్ లాల్, టి.రాజేష్, కె. జయలక్ష్మి, ఎస్‌విఎస్ఎన్ మూర్తి, ఎ.సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హై స్కూల్‌ల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నుంచి ఇంటర్మీడియట్ తరగతులు లాంఛనంగా ప్రారంభించామని జిల్లా ఉప విద్యాశాఖ


ఎస్‌కోట: విద్యార్థులకు పాఠాలు చెబుతున్న అధ్యాపకుడు

అధికారి కె.మోహన్ రావు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల పరిధిలోని గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుత ఏడాదిలో ఎంపిసి, సిఇసి మాత్రమే ప్రారంభిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రామభద్రపురం మండల విద్యాశాఖాదికారులు తిరుమల ప్రసాద్, పెంటయ్య విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థులను మోటివేట్ చేసి టార్గెట్ మేరకు ప్రవేశాలు కల్పించాలని సూచించారు.

'అధ్యాపకుల అభివృద్ధికి విజన్ 2025'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వచ్చే ఐదేళ్లలో విద్యార్థులను ఎలా సంసిద్ధులను చేయాలనే అంశంపై సెంచూరి యన్ విశ్వవిద్యాలయం వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. శనివారం సాయంత్రం అధ్యాపకులకు అభివృద్ధి కార్యక్రమం విజన్ 2025 అనే కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ప్రారంభించారు. వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు జూమ్ లో ప్రసంగిస్తూ గత పదేళ్లలో భారత సంపద రెట్టింపు అయ్యింద న్నారు. మరో పదేళ్లలో మళ్లీ రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇటువంటి సమయ ంలో నూతన టెక్నాలజీ వల్ల కొంతమంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తొందన్నారు. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు ఏ రకమైన నైపుణ్యాలతో ముందడుగు వేయాలో ఆయన వివరించారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ పల్లవి

అందుకు అనుగుణంగా అధ్యాపకులు సంసిద్ధులు కావాలన్నారు. ఇందుకోసం వారం రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్, ఒడిశా సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ డాక్టర్ సన్నీడియోల్, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ మురళీ, పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు కబ్జాకు యత్నం

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని మిలటరీ కాలనీ సమీపంలో ఉన్న చెరువును కబ్జా చేసేందుకు చేపల వ్యాపారి ప్రయత్నించగా రెవెన్యూ ఉద్యోగులు అడ్డుకున్నారు. మిలటరీ కాలనీ సమీపంలో సుమారు రెండెకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న చెరువును కబ్జా చేసేందుకు పట్టణానికి చెందిన చేపల వ్యాపారి ప్రయత్నించి ప్రొక్లెయిన్‌తో చదును చేయడం ప్రారంభించారు. చెరువును కబ్జా చేటున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి తెలియడంతో మల్లమ్మపేట, ఇందిరమ్మ కాలనీ విఆర్ఒ శ్రీనివాసరావు, లలితను చెరువు వద్దకు పంపించి కబ్జాను అడ్డుకున్నారు. చెరువును చదును చేస్తున్న ప్రొక్లెయిన్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. చెరువులను అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.


జెసిబితో చదును చేస్తున్న అక్రమార్కులు

చెరువు కబ్జాపై చర్యలు తీసుకోవాలి

చెరువు కబ్జాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కోట అప్పన్న వేర్వేరుగా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెరువులను ఆక్రమణ చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

జిందాల్ యాజమాన్యంతో ఎమ్మెల్యే చర్చలు

సిఎంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడి

ప్రజాశక్తి - కొత్తవలస

అప్పన్నపాలెం వద్ద జిందాల్ కర్మాగారం లేఆఫ్ ప్రకటించడంపై ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు జిందాల్ యాజమాన్యంతో శనివారం చర్చించారు. ఈ చర్చిల్లో జిందాల్ యాజమాన్యం నుంచి జిఎం దినేష్ శర్మ, డిజిఎం గోపాలకృష్ణ పాల్గొనగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర కొప్పుల వల్ల కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, ఎల్ కోట ఎంపిపి గేదెల శ్రీనివాస్, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేవుడు చర్చల్లో పాల్గొన్నారు. ఈ చర్చల్లో యాజమాన్యం మాట్లాడుతూ కంపెనీ తిప్పడం తమ చేతిలో లేదని, టాప్ మేనేజ్మెంట్ చేతిలో ఉందని తేల్చి చెప్పారు. పర్మినెంట్ కార్మికులకు మూడు నెలలు లే ఆఫ్ ఇస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వస్తుందని వచ్చిన


యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

వెంటనే సిఎం జగన్మోహన్ రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అంతవరకు కార్మికులు సమయమనం పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు నమ్మి చినబాబు, పిల్ల అప్పలరాజు, లగుడు వామాలు, పెదరెడ్ల ప్రసాదు, బొట్ట రాము, సలాది భీమయ్య, బాలిబోయిన ఈశ్వరరావు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

డిమ్స్ కంప్యూటర్స్ 31వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

డిమ్స్ కంప్యూటర్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 35 మంది విద్యార్థులకు సంస్థ కార్యాలయంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శనివారం డిమ్స్ కంప్యూటర్స్ 31వార్షికోత్సవంలో భాగంగా అధినేత కెఎస్‌బికె రాజు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సి.లాంగ్వేజ్, పైతాన్ లాంగ్వేజ్, జావా, సి ప్లస్ ప్లస్, ఒరాకిల్, డిజిటల్ మార్కెటింగ్ మొదలగు కోర్సులలో అత్యుత్తమ శిక్షణ అందిస్తూ, ఐఎస్ఒ గుర్తింపు కలిగిన సర్టిఫికెట్ ఇస్తున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఫర్ ఓవర్సీస్, ఇతర దేశాల్లో చదువుకోడానికి కావలసిన ఇన్ఫర్మేషన్ గైడెన్స్ త్వరలో డిమ్స్ కంప్యూటర్ ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ వాహనాలు సీజ్

రామభద్రపురం : అక్రమంగా వినియోగిస్తున్న వాహనాలపై నిఘా ఉంచామని దీనిలో భాగంగానే కార్డన్ తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. సిబ్బందితో కలిసి శనివారం రాత్రి కొండ కెంగువలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మోటారు వాహనాల చట్టాలకు లోబడి ధ్రువ పత్రాలు లేని 10 వాహనాలు సీజ్ చేసి స్టేషనుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్టాల అతిక్రమణలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా 'గొంప' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట


యువనేత, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ జన్మదిన వేడుకలను పట్టణంలోని టిడిపి కార్యాలయంలో కృష్ణ అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఎటువంటి పదవులను ఇచ్చిన ఇవ్వకున్నా ప్రజాసేవ చేస్తూనే ఉంటానని అందులో భాగంగానే మహిళ అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న టైలరింగ్ బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాలను కొనసాగిస్తామని అన్నారు. శిక్షణను తీసుకున్న మహిళలకు ప్రభుత్వం ద్వారా గాని లేక తన సొంత ఖర్చులతో గాని టైలరింగ్ బ్యూటిషన్ చేసుకునేందుకు తగిన సామాగ్రిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని ఐదు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


కృష్ణకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

కిరణ్ కుటుంబానికి అశోక్ పరామర్శ

ప్రజాశక్తి - గుర్ల

టిడిని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుములరాజు కిరణ్ కుమార్ కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి టిడిపి పొలిటీబ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి పరామర్శించారు. ఇటీవల కిరణ్ కుమార్ తండ్రి, టిడిపి సీనియర్ నాయకులు తిరుములరాజు రాఘవరాజు (రాంబాబు) స్వర్గస్తులైన సంగతి తెలిసిందే. శనివారం అశోక్ గజపతిరాజు వారి కుటుంబాన్ని పరామర్శించి రాఘవరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనితో పాటు ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణ రాజు, (సురేష్ బాబు.), మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసి నాయుడు, ఐటిడిపి నాయకులు నాగులపల్లి నారాయణరావు తదితరులున్నారు.


నివాళి అర్పిస్తున్న అశోక్, తదితరులు

ఘనంగా హనుమాన్ జయంతి

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద శనివారం వీరాంజనేయ స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. వల్లంపూడి గ్రామంలో గణేష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.

తెర్లాం: మండలంలోని పెరుమాలి, పాములవలస తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పెరుమాలి హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహానికి సింధూర వర్ణాలు గల పూలమాలలో తమలపాకులతో చేసిన మాలలు ఆ గ్రామ సర్పంచ్ ఎస్ హేమలత తన భర్త అప్పల నరసింహారాజు ఆధ్వర్యంలో వేసి పూజలు నిర్వహించారు. అనంతరం పెరుమాలి ఆలయాల దగ్గర అన్నదాన కార్యక్రమాలు క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జగరాజు, టిడిపి నాయకులు సాగిరాజు, జగన్నాథరాజు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక బై పాస్ జంక్షన్ వద్ద మారుతి కాలనీ యువత పెద్దయెత్తున పూజలు నిర్వహించి బారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆరికతోట, బూసాయవలస, తారాపురంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బొబ్బిలి: పట్టణంలో హనుమాన్ జయంతి ఘనంగా జరిగింది. పార్కు చెరువు గట్టు, పాత బొబ్బిలి, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి డౌన్, మల్లమ్మపేటలో ఉన్న శ్రీఅంజనేయ స్వామి ఆలయాలు, బజారు రామాలయంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు.

అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

అనుమతులు లేని నిర్మాణాలు, లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలోని గొల్లవీధి, అప్పయ్యపేట వద్ద ఉన్న లేఅవుట్లను, విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న అపార్ట్‌మెంట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసిన, నిర్మాణాలు చేపట్టిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. లేఅవుట్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుని ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.